క్లుప్తంగా

బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ దిలీప్ కుమార్

ఆలూరు రూరల్: బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ దిలీప్ కుమార్ అన్నారు. మహిళా దినోత్సవంలో భాగంగా గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఇంటర్, డిగ్రీ విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే మహిళా హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమన్నారు. పోలీసు స్టేషన్ అడ్మినిస్ట్రేషన్ గురించి విద్యార్థులకు తెలియజేశారు.

తనఖా భూములు అమ్మితే చర్యలు



మాట్లాడుతున్న సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్

తుగ్గలి: సహకార సంఘాల్లో తనఖా పెట్టి తీసుకున్న అప్పులు చెల్లించకుండా భూములు అమ్మినా, ఇతరుల పేర్లపై మార్చినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మారెళ్ల సహకారం సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ అశోక్ కుమార్, కేడీసీసీ బ్యాంకు పత్తికొండ చీఫ్ మేనేజర్ సింగం శ్రీనివాసులు తెలిపారు. గురువారం బ్యాంకు కార్యాలయంలో వారు మాట్లాడారు. సకాలంలో బకాయిలు చెల్లించి బ్యాంకుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అప్పులు, తనఖా వివరాలు పూర్తిగా తెలుసుకున్న తర్వాతే భూములు కొనుగోలు చేయాలని సూచించారు. బ్యాంకు సీఈఓలు మనోహరనాయుడు, గిడ్డయ్య పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్

మద్దికెర: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని గురువారం తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలన్నారు. పరీక్ష కేంద్రం చుట్టుపక్కల సంచరిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఆదేశించారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. ఈయన వెంట చీఫ్ సవిత, డిపార్ట్‌మెంటల్ అధికారి కిరణ్మయి ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



హొళగుందలో వృద్ధురాలికి నిత్యావసర సరుకులు ఇస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

హొళగుంద: మండల పరిధిలోని మార్లమడికి, హొళగుంద గ్రామాలకు చెందిన అనాథ వృద్ధులు, దివ్యాంగులు, మరికొందరికి గురువారం ఆదోని వివేకానంద సేవా సంస్థ, భారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసరుకులు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్ష, ఉపాధ్యక్షులు మూర్తి, ప్రకాష్, సిద్ధార్థగౌడ్ ఆధ్వర్యంలో రవికాంత్, గాలెప్ప, రాజ తదితరులు బియ్యం, కందిబ్యాళ్లు, వంటనూనె, చక్కర ఇతర సరుకులను అందజేశారు. వీరికి 38 నెలలుగా నిత్యావసర సరుకులు అందిస్తున్నట్లు స్వచ్ఛంద సంస్థ సభ్యులు తెలిపారు.

బీసీ గురుకుల పాఠశాల తనిఖీ



విద్యార్థినిని విచారిస్తున్న డీఆర్వో

వెల్దుర్తి: స్థానిక జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులాన్ని కర్నూలు డీఆర్వో వెంకట నారాయణమ్మ గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. గతేడాది నవంబర్‌లో 8వ తరగతి చదువుతున్న ఇరువురు విద్యార్థినుల తగువులాటలో గురుకులం ప్రిన్సిపాల్, పీఈటీ తీసుకున్న చర్యలు, తత్ఫలితంగా ఒక విద్యార్థిని గురుకులం మానేసి స్థానిక బాలికల హైస్కూల్‌లో చదువుతుండగా, రామళ్లకోట విద్యార్థిని హాస్టల్ వదిలేసి గ్రామం నుంచి బస్సులో అప్‌అండ్‌డౌన్ చేస్తోంది. ఈ విషయం బయటకు పొక్కడంతో పాటు గురుకులం ప్రిన్సిపాల్, పీఈటీలపై విద్యార్థుల తల్లితండ్రులు పలు అభియోగాలు మోపడంతో విషయం తెలుసుకున్న డీఆర్వో ఇరువురు విద్యార్థినులను పిలిపించి విచారించారు. పూర్తిస్థాయి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నట్లు డీఆర్వో తెలిపారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ యమున, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉన్నారు.

అవశేషాలు.. మలి పంటకు బలం

- దహనం చేయడం వల్ల నష్టాలే అధికం
- పర్యావరణానికి సైతం పెను విఘాతం



దేవనకొండ వద్ద పత్తి కట్టెను తగలపెడుతున్న దృశ్యం

దేవనకొండ: సహజ పద్ధతుల్లో వ్యవసాయం ద్వారా నేల సారవంతమవుతుంది. నూర్పిడి అనంతరం పంట అవశేషాలను అధిక శాతం రైతులు వాటిని పొలాల్లోనే తగలబెడుతున్నారు. దీంతో నేల సారాన్ని కోల్పోవడమే కాకుండా పర్యావరణానికి తీరని ముప్పు చేకూరుస్తుంది. వాటిని కాల్చకుండా పొలంలో కలియదున్నితే భూమికి అదనపు బలాన్ని ఇస్తుంది. ఒకప్పుడు పంటల అవశేషాలను కలియదున్నడం ద్వారా ఎరువుగా మార్చుకొని సేంద్రియ వ్యవసాయ విధానం ద్వారా మంచి దిగుబడులు సాధించిన రైతులు ప్రస్తుతం అందుకు పూర్తి భిన్నంగా వాటిని దగ్ధం చేస్తుండటంతో పలు విధాలుగా నష్టపోతున్నారు. తెగుళ్ల అధికంగా ఆశిస్తుండడం, వాటి నివారణ కోసం రసాయన ఎరువులు విస్తారంగా వినియోగించడం వల్ల వాటిని కలియదున్నితే, ఆ దుష్ప్రభావం తదుపరి పంటలపై ఉంటుందనేది రైతుల భావన. తద్వారా వాటిని తగలబెడితే తెగుళ్లకు కారణమయ్యే బ్యాక్టీరియా నశిస్తుందనే ఆలోచనలో ఉన్నారు. మరి కొందరు త్వరితగతిన మరో పంట వేసుకునేందుకు వీలుగా అవశేషాలను తగలబెడుతున్నారు. అయితే దీనివల్ల లాభం లేకపోగా, నష్టం అధికంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

కలియదున్నితే ప్రయోజనం..

అవశేషాలను తగలబెట్టడానికి బదులు భూమిలో ముగ్గబెట్టి దుక్కిలో కలిపి దున్నడం ద్వారా ప్రయోజనం ఉంటుంది. వరి మొక్కను కింద వరకు కోసి గడ్డి కింద ఉపయోగించుకోవచ్చు. అవశేషాలను దుక్కిలో కలిపి దున్నడం ద్వారా సేంద్రియ కర్బనం పెరిగి పంటలకు మేలు చేకూరుతుంది. మల్చర్ యంత్రం ద్వారా పత్తి, మొక్కజొన్న పంటలను దున్నితే సత్వరం భూమిలో కలుస్తుంది. వరి పొలాల్లో రోటావేటర్ ద్వారా కలియదున్నితే పోషకాలు మొక్కకు అందుబాటులో ఉంటాయి. సేంద్రియ ఎరువుగా మారి మరో పంట దిగుబడి అధికంగా రావడానికి ఉపయోగపడుతుంది.

నష్టమే..

గతంలో పంట కాలం పూర్తయిన తర్వాత రైతులు వాటి అవశేషాలను అలాగే ఉంచేవారు. మళ్లీ సాగు చేసే సమయంలో వాటిని కలియదున్నేవారు. అయితే ప్రస్తుతం అందుకు భిన్నంగా వాటి అవశేషాలను కాల్చేస్తున్నారు. వరి, పత్తి, మినుము, మొక్కజొన్న తదితర పంటల కాలం పూర్తయిన వెంటనే మరో పంట సాగు కోసం వాటిని కలియదున్నే సమయం లేకపోతుండటంతో తగలబెట్టడం ఇటీవల పరిపాటిగా మారింది. ఈ ప్రక్రియ సులభమే అయినప్పటికీ ఎటువంటి లాభం లేకపోగా నష్టం మాత్రం తీవ్రంగా ఉంటుంది. అవశేషాలను దహనం చేయడం ద్వారా పర్యావరణానికి పెనువిఘాతం కలుగుతుందని, అలాగే పంటలకు మేలుచేసే ఎరలు, ఇతర సూక్ష్మక్రిములు పూర్తిగా నశిస్తాయని, తద్వారా భూమి నిస్సారమవుతుందని, ఫలితంగా ఎంత పెట్టుబడులు పెట్టినా, ప్రయోజనం ఉండదని వ్యవసాయ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

భూమి నిస్సారమవుతుంది



పంటల అవశేషాలను కాల్చడం ద్వారా పర్యావరణానికి పెను విఘాతం కలుగుతుంది. పంటలకు మేలు చేసే ఎరలు, ఇతర సూక్ష్మక్రిములు పూర్తిగా నశిస్తాయి. దీంతో భూమి నిస్సారమవుతుంది. ఫలితంగా ఎంత పెట్టుబడులు పెట్టినా, ప్రయోజనం ఉండదు. అవశేషాలను తగలబెట్టడానికి బదులు దుక్కిలో కలిపి దున్నడం ద్వారా ప్రయోజనం ఉంటుంది. నేలలో సేంద్రియ కర్బనం పెరిగి పంటలకు మేలు చేకూరుతుంది. దిగుబడులు పెరడగమే కాకుండా తెగుళ్ల బెడద కొంతమేర తగ్గుతుంది.

– సురేష్‌బాబు, దేవనకొండ మండల వ్యవసాయాధికారి

దరఖాస్తుల గడువు పెంపు

కృష్ణగిరి: మండలంలోని కంబాలపాడు బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి, ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈ నెల 13వ తేదీ వరకు పెంచినట్లు ప్రిన్సిపాల్ సుజాత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఇది వరకే ఈ నెల 6వ తేదీకి తుది గుడువు విధించగా మరో మారు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బార్ అసోసియేషన్‌కు నోటిఫికేషన్

పత్తికొండ రూరల్: పత్తికొండ బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు గురువారం ఎన్నికల అధికారి ఆవుల మైరాముడు నోటిఫికేషన్ విడుదల చేశారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, లైబ్రేరియన్, సహాయ కార్యదర్శి, మహిళా ప్రతినిధి పోస్టులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 20, 21 తేదీల్లో నామినేషన్‌ల స్వీకరణ, 22న పరిశీలన, 23న ఉపసంహరణ ఉంటుందన్నారు. 27న 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్, అనంతరం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

ఉపాధి కూలీలకు వంద రోజుల పని



ఆలూరులోని నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకట రమణయ్య

ఆలూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఉపాధి కూలీకి వంద రోజుల పని దినాలు కల్పించాలని కర్నూలు జిల్లా డ్వామా పీడీ వెంకట రమణయ్య ఆ శాఖ అధికారులకు సూచించారు. స్థానిక సీఎల్‌ఆర్సీ భవనం సమీపంలోని నర్సరీలో గురువారం ఆయన మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 64 వేల మంది కూలీలు రోజు పనికి వెళ్తున్నారన్నారు. కూలీలకు ఎనిమిది వారాల వేతనాలు రూ. 29 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.47 కోట్లు అందాల్సి ఉందన్నారు. రబీ సీజన్‌లో భాగంగా కౌతాళం, పెద్దకడుబూరు మండలాల కరువు మండలాలను ప్రకటించడంతో ఆ మండలాల్లో ఉపాధి కూలీలకు 150 రోజుల పని దినాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. మండలంలో గురువారం ఎన్ని చోట్ల పని పెట్టారని ఎంత మంది కూలీలు పనికి వెళ్లారని ఆరా తీశారు. ఏపీడీ పద్మావతి, ఏపీఓ శ్రీనివాసులు ఉపాధి హామీ ఈసీ, టీఏలు సీఎల్‌ఆర్సీ సిబ్బంది ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

హాలహర్వి: మండలంలోని చింతకుంట గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం జిల్లా డ్వామా పీడీ వెంకటరమణయ్య పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిట్టుబాటు వేతనం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలం దృష్ట్యా ఉదయం 6 నుంచి 10 గంటల్లోపే ఉపాధి పనులు చేయాలని సూచించారు. గిట్టుబాటు వేతనం రూ.300 అందేలా చూడాలని ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఆయన వెంట ఏపీఓ చక్రవర్తి, ఈసీ దేవరాజు, టెక్నికల్ అసిస్టెంట్ రాము తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తి పవిత్రమైంది



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్

పత్తికొండ రూరల్: న్యాయవాద వృత్తిలో యువ న్యాయవాదులు రాణించాలని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ అన్నారు. కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం దూదేకొండకు చెందిన యడవల్లి సుధాకర్ సభ్యత్వం తీసుకుని యువన్యాయవాదిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైనదని, అంకిత భావంతో విధులు నిర్వర్తించి కక్షిదారులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, సీనియర్ న్యాయవాదులు సురేష్‌కుమార్, నరసింహయ్యాచారి, సత్యనారాయణ, నాగేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

వెల్దుర్తి: చిన్నారుల్లో శారీరక లోపాలు, అనారోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యమందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా అధికారి డాక్టర్ రఘు అన్నారు. గురువారం రామళ్లకోట పీహెచ్‌సీ పరిధిలోని బోయనపల్లె ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు జరుగుతున్న వైద్య పరీక్షలను ఆయన పరిశీలించారు. పిల్లల్లో కనిపించే స్వల్ప అనారోగ్య లక్షణాలు దీర్ఘకాలిక వ్యాధులుగా మారకుండా పరీక్షలు చేసి తగు చికిత్స అందించడం జరుగుతుందన్నారు. అపుడే పుట్టిన శిశువు నుంచి 18 ఏళ్లలోపు వారందరికీ 30 రకాల ఆరోగ్య సమస్యలను గుర్తించేందుకు పరీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి భువనతేజ, హెచ్‌ఎం నాగేంద్ర, ఆరోగ్య సిబ్బంది మోహన్, జాన్‌పాల్, రాములమ్మ పాల్గొన్నారు.

హాస్టల్‌లో సౌకర్యాలకు ఆర్థికసాయం

వెల్దుర్తి: స్థానిక బీసీ బాలికల హాస్టల్‌లో సౌకర్యాల కోసం తమ వంతుగా స్థానిక జెడ్పీహైస్కూల్ 1988–89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.10వేల విరాళాన్ని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శైలజకు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హరిసింహానాయుడు, షేక్షావలి, పరమేష్, ఖలీల్, పెద్ద రజాక్ పాల్గొన్నారు.

10న అంగన్‌వాడీల మహాధర్నా

వెల్దుర్తి: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు మాధవస్వామి, అసోసియేషన్ మండల అధ్యక్షురాలు ఈదమ్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం సూపర్‌వైజర్లు సునీత, సరస్వతికి వినతిపత్రం అందజేశారు.

సోలార్ కంపెనీలకు భూములిచ్చి మోసపోవద్దు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్

ఆలూరు / ఆలూరు రూరల్: సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం రైతులు తక్కువ ధరకే తమ భూములు విక్రయించి మోసపోవద్దని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ సూచించారు. స్థానిక జ్యోతిబసు భవన్‌లో గురువారం సోలార్ ప్రాజెక్టు కోసం భూముల విక్రయాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. సోలార్ కంపెనీలు ఎకరా భూమిని రైతు నుంచి రూ.5 లక్షలకు కొనుగోలు చేస్తున్నారని.. ఏడాదికి లీజు కింద రూ.30 వేలు చెల్లించి 30 ఏళ్ల పాటు లీజు కింద రాయించుకుని రైతులను మోసం చేస్తున్నారని చెప్పారు. దీనికి తోడు భూమిని లీజుకు ఇచ్చే రైతులే బ్యాంకులలో పొలంపై తీసుకున్న రుణాలు చెల్లించి సంబంధిత పొలం పత్రాలను కంపెనీకి ఇవ్వాలనే నిబంధనలు పెట్టారన్నారు. సోలార్ కంపెనీ నిర్వాహకులు ప్రతి రైతు నుంచి ఎకరా భూమిని రూ.20 లక్షలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల లీజుకు రూ.50 వేలు చెల్లించాలన్నారు. రైతులతో కలిసి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు, నాయకులు వెంకటేశ్వర్లు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తే వాహనాలు సీజ్

సాక్షి ఎఫెక్ట్



కృష్ణాపురం కొండను పరిశీలిస్తున్న మైనింగ్ జిల్లా అధికారులు

ఆలూరు రూరల్: అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తే వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని మైనింగ్ శాఖ జిల్లా అసిస్టెంట్ జియోజికల్ ఆఫీసర్ రాజశేఖర్, విజిలెన్స్ రీజినల్ ఇన్‌స్పెక్టర్ సాంబశివారెడ్డి హెచ్చరించారు. గత నెల 23న సాక్షి దినపత్రికలో 'అక్రమార్కులకు అడ్డేది' శీర్షికన ప్రచురితమైన కథనానికి మైనింగ్, విజిలెన్స్ అధికారులు స్పందించారు. హత్తిబెళగల్ గ్రామం వద్ద తవ్వకాలు జరుపుతున్న కృష్ణాపురం కొండను బుధవారం రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి వారు పరిశీలించారు. సర్వే నంబర్ 557లో 106 ఎకరాల్లో కృష్ణాపురం కొండలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు నిషేధించామన్నారు. అయినా కొందరు అక్రమార్కులు అర్ధరాత్రి పొలాల్లో అడ్డదారిలో లారీల నుంచి గ్రావెల్ తరలిస్తున్నారని రెవెన్యూ అధికారులు మైనింగ్ ఆఫీసర్ల దృష్టికి తీసుకెళ్లారు. అక్రమ గ్రావెల్ తరలింపులు జరగకుండా టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటు చేసి వాహనాలు సీజ్ చేసి జరిమానా విధిస్తామని మైనింగ్ అధికారులు వెల్లడించారు. వారి వెంట మైనింగ్ టీఏ దిలీప్‌కుమార్, ఆర్ఐ బసవన్న గౌడ్, వీఆర్వో అమరేశ్వర్ రెడ్డి ఉన్నారు.

స్త్రీనిధి వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

తుగ్గలి: స్త్రీ నిధి రుణ బకాయిల వసూళ్ల కోసం అధికార యంత్రాంగం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది. మండలంలో రూ.10 లక్షల వరకు స్త్రీ నిధి రుణ బకాయిలు ఉన్నాయి. మొండి బకాయిల వసూళ్ల కోసం ఏపీఎం రాధాకృష్ణ, స్త్రీ నిధి మేనేజర్ రజాక్, సీఆర్పీలు గురువారం గిరిగెట్ల, కడమకుంట్ల, ఎద్దులదొడ్డి, రాతన, తుగ్గలిలో పర్యటించారు. బకాయిదారులను కలిసి రుణాలు చెల్లించాలని కోరారు. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లిస్తే కొత్త వారికి స్త్రీ నిధి రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు.

11న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో ఈనెల 11వ తేదీన జరగనున్న లక్ష్మీచెన్నమాధవ స్వామి తిరునాల సందర్భంగా తెర్నెకల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఉద్యోగ సంఘం నాయకులు గురువారం తెలిపారు. ఇందులో విజేతలకు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు చొప్పున అందజేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 10వ తేదీలోపు టీంల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94918 69398, 96030 44700 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

ఆక్రమణలు తొలగించాలని నోటీసులు

మద్దికెర: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి బంకులు ఏర్పాటు చేసుకున్న వారు ఖాళీ చేయాల్సిందేనని పంచాయతీ కార్యదర్శి శివకుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం బంకుల యజమానులకు నోటీసులు అందజేశారు. గ్రామాభివృద్ధిలో భాగంగా రోడ్ల వెడల్పు, కమర్షియల్ గదుల నిర్మాణం చేపడుతున్నామని.. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. త్వరలోనే నిర్మాణాలు పూర్తి చేసి గతంలో ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోండి

తుగ్గలి : ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న పశు బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జొన్నగిరి పశువైద్యాధికారి బాలకృష్ణ తెలిపారు. పాడి గేదెలు, ఆవులు అనారోగ్యంతో మరణిస్తే బీమా వర్తిస్తుందన్నారు. గేదెలు, ఆవులున్న ఎస్సీ, ఎస్టీ పశు పోషకులకు 80 శాతం రాయితీ, దారిద్ర్యరేఖకు ఎగువనున్న పశుపోషకులకు 50 శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తుందని తెలిపారు. రూ.15వేల బీమాకు ఒక్కో పశువుకు రాయితీ రూ.768పోను రూ.192, రూ.30వేల బీమాకు రూ.1536 రాయితీ పోను రూ.384 ప్రీమియం ఎస్సీ, ఎస్టీ రైతులు చెల్లించాలన్నారు. దారిద్ర్యరేఖకు ఎగువనున్న పశు పోషకులు రూ.15వేల బీమాకు రూ.480 రాయితీ పోను రూ.480, రూ.30వేల బీమాకు రూ.960 రాయితీ పోను రూ.960 చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. బీమా ప్రీమియం గడువు మూడేళ్ల పాటు ఉంటుందన్నారు. వివరాలకు పశువైద్యశాలలను సంప్రదించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు

మద్దికెర: వాతావరణంలో మార్పులు, వేసవి ప్రారంభంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని.. నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు శ్రీలక్ష్మి, రాగిణి అన్నారు. ఉష్ణోగ్రత పెరిగి చాలా మందికి జ్వరాలు, జలుబు, దగ్గు వంటివి వస్తున్నాయని తెలిపారు. సకాలంలో వైద్య పరీక్షలు చేయించి అందుకు తగ్గ మందులు వాడాలని సూచించారు.

27 నుంచి ఎల్లార్తిలో ప్రవచనాలు

హొళగుంద: ఎల్లార్తి గ్రామంలో ఈ నెల 27 నుంచి సజ్జలగుడ్డ శరణమ్మ అవ్వ పురాణ ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం విలేకరులకు తెలిపారు. అదేవిధంగా ఏప్రిల్ 2న శ్రీశైల పీఠం శ్రీ 1008 జగద్గురువుల అడ్డపల్లకీ మహోత్సవం, ముత్తైదువుల వడిబియ్యం నింపే కార్యక్రమం ఘనంగా జరుగుతుందన్నారు.

ఉదయం 6 గంటలకే పనికి హాజరుకావాలి

హాలహర్వి: ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల ఉపాధి పనులకు ఉదయం 6 గంటలకే ఉపాధి కూలీ హాజరుకావాలని ఏపీఓ చక్రవర్తి అన్నారు. గురువారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఆయన ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఏపీఓ మాట్లాడుతూ ఉదయం 6 నుంచి 11 గంటల వరకే ఉపాధి పనులు చేయాలన్నారు. పనులు కావాలని అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పించాలని సూచించారు.

పకడ్బందీగా రీ-సర్వే



జూటూరులో రీసర్వేను పరిశీలిస్తున్న జేసీ నవ్య

పత్తికొండ రూరల్: రైతులకు సమస్యలు తలెత్తకుండా రీ–సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య సూచించారు. గురువారం పత్తికొండ మండలం జూటూరు గ్రామంలో జరుగుతున్న రీ–సర్వేను ఆర్డీఓ భరత్‌నాయక్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. రైతుల భూముల కొలతల్లో పారదర్శకత పాటించాలన్నారు. మ్యూటేషన్ లేకుండా రైతుల భూముల పేర్లు మార్చరాదని తహసీల్దార్లను ఆదేశించారు. సర్వే విషయంలో ఎక్కడా సమస్య తలెత్తకుండా చూడాలని సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఏదైనా సమస్య తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈమె వెంట తహసీల్దారు రమేష్, సర్వేయర్లు ఉన్నారు.

రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

ఆస్పరి: రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని జేసీ నవ్య సూచించారు. గురువారం మండలంలోని హలిగేర గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా రీ సర్వే చేపట్టాలని తహసీల్దార్ రామేశ్వరరెడ్డి, రీ సర్వే డీటీ భీమేష్‌కు సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి స్థల పరిశీలన

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గురువారం కర్నూలు జాయింట్ కలెక్టర్ నవ్య, పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణానికి రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని జేసీ కోరారు. ఆమె వెంట రెవెన్యూ అధికారులు, సర్పంచ్ ఎం.అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఈకేవైసీని త్వరితగతిన పూర్తిచేయాలి

పత్తికొండ రూరల్: రేషన్‌కార్డు కలిగిన వారందరితో తప్పకుండా ఈకేవైసీ పూర్తి చేయించాలని పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ అన్నారు. గురువారం పత్తికొండ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రీసర్వే డీటీలు, మండల సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అర్జీలకు సరైన సమాధానం ఇవ్వాలన్నారు. రీసర్వేకు సంబంధించి రైతులకు ముందస్తు నోటీసు ఇచ్చి ఆ తరువాత సర్వే చేయాలన్నారు. ప్రతి రేషన్‌కార్డుదారుడు డీలర్ వద్ద కు వెళ్లి ఈకేవైసీ పూర్తి చేయించుకునేలా చూడాలని చెప్పారు.

సొంత ఖర్చులతో కార్యాలయానికి మరమ్మతు



సున్నం వేసి మరమ్మతులు చేసిన తరువాత నేమకల్లు పశువైద్యశాల

చిప్పగిరి: మండలంలోని రామదుర్గం, నేమకల్లు తదితర గ్రామాల్లోని పశువైద్యశాలలు శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది అనేక ఇబ్బంది లు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. మరమ్మతుల కోసం అనేక సార్లు ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపినా ఎవరూ స్పందించక పోవ డంతో నేమకల్లు పశువైద్యశాలలో విధులు నిర్వహించే సిబ్బందే ఇటీవల రూ 8,000 సొంత ఖర్చులు వెచ్చించి కార్యాలయానికి సున్నం వేసి మరమ్మతులు చేసుకున్నారు. సిబ్బందే తన సొంత ఖర్చులతో కార్యాలయాలు మర మ్మతు చేసుకుంటే ఇక ప్రభుత్వాలు ఎందుకని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఎల్లార్తి దర్గాల్లో ఫాతెహాలు



షేక్షావలి దర్గాకు తరలి వచ్చిన భక్తులు

హొళగుంద: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల్లో గురువారం భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు రాత్రి దర్గా పరిసరాల్లో నిద్రించారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డీసాయిబాబా ఆలయాలను దర్శించుకున్నారు.

ఉచ్చీరప్పతాతకు ప్రత్యేక పూజలు



రథాన్ని బయటకు లాగుతున్న భక్తులు

ఆలూరు: మండలంలోని పెద్దహోతూరు, మరకట్టు గ్రామాల్లో కొలువుదీరిన ఉచ్చీరప్ప, చలువప్పతాత ఉత్సవాలకు గురువారం అర్చకులు చంద్రమౌళీస్వామి అంకురార్పణ చేశారు. ఉదయం గణపతిపూజ, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అంతక ముందు షెడ్‌లో ఉన్న ఉచ్చీరప్పతాత రథాన్ని భక్తులు బయటకులాగారు. నేటి నుంచి గ్రామంలో భక్తులు సయమ నిష్ఠతలను ఆచరించాలని తీర్మాణం చేసుకున్నారు. పెద్దలకు అర్చకులు చంద్రమౌళీ స్వామి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రమణీయం.. రంగనాథుని రథోత్సవం



అశేష భక్తజనం నడుమ రథోత్సవం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పులికొండ గ్రామంలో వెలసిన సంతాన వరధుడు శ్రీరంగ నాథ స్వామి రథోత్సవం గురువారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ఈఓ వీరయ్య ఆధ్వర్యంలో ముందుగా స్వామివారికి, రథానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో స్వామివారి రథాన్ని భక్తులు లాగారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ జయన్న పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తిభావం పెరగాలి



భక్తులకు సూచనలిస్తున్న స్వాములు

హొళగుంద: ప్రజల్లో క్రమశిక్షణ, మానవత్వం, భయం అనేవి ఉండాలంటే వాళ్లలో భక్తిభావం పెరగాలని జె.హొసళ్లి పురమఠం పీఠాధిపతులు జాత శంభులింగ శివాచార్యులు, పాల్తూరు మఠం పీఠాధిపతులు చెన్నవీర మల్లికార్జున శివాచార్య అన్నారు. గురువారం రాత్రి హొళగుంద, ఎల్లార్తి వీరభద్రేశ్వరస్వామి, ఈశ్వర స్వామి ఆలయాలలో ఎల్లార్తిలో ఏప్రిల్ 2న, హొళగుందలో ఏప్రిల్ 18, 19 తేదీల్లో జరిగే అడ్డపల్లకీ మహోత్సవ కార్యక్రమం, సంగీత ఇష్టలింగ పూజ నిర్వహణపై వీరశైవ లింగాయత్, ఇతర వర్గాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్ద, ఆలయ ధర్మకర్త రాజ పంపన్నగౌడ్, వీరశైవ కులపెద్దలు తదితరులు పాల్గొన్నారు.